వలంటీర్లు.. ప్రజా సేవకులు



పామిడి : వలంటీర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి

● ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుత్తి: వలంటీర్లు ప్రజా సేవకులని, వారిని సత్కరించడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం గుత్తి మునిసిపాలిటీ, మండలంలోని మెత్తం 413 మంది వలంటీర్లను సేవా పురస్కారాలతో సన్మానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో వలంటీర్లు ఎంతగానో శ్రమిస్తున్నారన్నారు. దేశానికి సైనికులు ఎంత ముఖ్యమో వైఎస్ జగన్ సర్కారుకు వలంటీర్లు అంతేనన్నారు. కరోనా సమయంలో కూడా వలంటీర్లు ఎంతో బాధ్యతగా పని చేశారని గుర్తు చేశారు. వలంటీర్ల సేవలను గుర్తించి పురస్కారాలు అందిస్తున్నామన్నారు. భవిష్యత్తులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారిని గౌరవిస్తారన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, ఎంపీపీ విశాలాక్షి, మున్సిపల్‌కమిషనర్ శ్రీనివాసులు, ఎంపీడీఓ శ్రీనివాసులు, మార్కెట్ యార్డు చైర్మన్ సునీలా, వైఎస్సార్‌సీప పట్టణ, మండల కన్వీనర్లు పీరా, గోవర్ధన్‌రెడ్డి వలంటీర్ల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మండల, పట్టణ, సచివాలయ కన్వీనర్లు సుభాష్‌రెడ్డి , రంగస్వామి, జిల్లా నాయకులు గురుప్రసాద్ యాదవ్, మధుసూదన్‌రెడ్డి, సీవీ రంగారెడ్డి, రాజ్‌కుమార్ రెడ్డి, మల్లి కార్జున, బేడల వెంకటరాముడు, మున్సిపల్ వైస్ చైర్మన్లు వరలక్ష్మి, పద్మలత, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రభుత్వం, ప్రజలకు వారధులు వలంటీర్లు

పామిడి: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులు వలంటీర్లు అని ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి అన్నారు. మంగళవారం ఈఓఆర్డీ బీవీ శశికళ అధ్యక్షతన స్థానిక అనిమిరెడ్డి ఫ్యాక్టరీలో మండలంలోని వలంటీర్లను సన్మానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థతో 1.37 లక్షల మంది, వలంటీర్ పోస్టుల ద్వారా 2.50 లక్షల మంది ఉపాధి కల్పించిన ఘనత తమ ప్రభుత్వానిదన్నారు. కరోనా సమయంలోనూ వలంటీర్లు తమ ప్రాణాలు సైతం ఫణంగా పెట్టి పని చేశారని గుర్తు చేశారు. కులం, మతం, పార్టీ అన్న బేధం లేకుండా ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో వలంటీర్లదే ముఖ్య భూమిక అన్నారు. అందుకే ప్రజా ప్రతినిధులలైన తమకంటే ప్రజల్లో వలంటీర్లకే అధిక ప్రాధాన్యత లభిస్తోందన్నారు. ప్రభుత్వానికి వలంటీర్లు ఓ శక్తి వంటివారన్నారు. శక్తివంచనలేకుండా పనిచేస్తున్న వారిని ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో వలంటీర్లకు వందన కార్యక్రమం చేపట్టామన్నారు. అనంతరం వెయ్యిమందికి భోజన సదుపాయం కల్పించారు. తహసీల్దార్ ఆర్వీ సునిత బాయి, వైఎస్సార్‌సీపీ రూరల్ కన్వీనర్ కే నారాయణరెడ్డి, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ ఎం లిఖిత, ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి, సచివాలయాల పట్టణ కన్వీనర్ బీ ఆసిఫ్, సింగిల్ విండో మాజీ ప్రెసిడెంట్ చుక్కలూరు రామకృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు ఎస్ అనిమిరెడ్డి, ఓసీ విభాగం రాష్ట్ర డైరెక్టర్ కుమ్మెత లక్ష్మి, వైస్ ఎంపీపీ నక్కా సౌభాగ్య, బోయ రామచంద్ర, నాయకులు సీ అబ్దుల్ రజాక్, అబుసాలేహా, ఆదామ్, సూరి, హరి, జోజోడే కుమార్, సర్పంచ్ డీసీ ముత్యాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, పాళ్యం శీనా, నరసింహులు పాల్గొన్నారు.

జేసీ సోదరుల ఉచ్చులో పడొద్దు

● ప్రజా సంక్షేమ యాత్రలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి: మొసలి కన్నీరు కార్చిందని జాలిపడి మళ్లీ ఆదరించారో మీ జీవితాలు బుగ్గిపాలు కావడం ఖాయమని, జేసీ సోదరుల ఉచ్చులో పడొద్దంటూ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రజలకు సూచించారు. మంగళవారం ఆయన వంగనూరు నుంచి ప్రజా సంక్షేమ యాత్ర ప్రారంభించి, కొండేపల్లి, జంబులపాడు, చల్లవారిపల్లి, గన్నెవారిపల్లి పంచాయతీలోని ఆర్డీటీ కాలనీ మీదుగా సాగారు. ఆయా గ్రామాల ప్రజలు ఆయనకు పూలవానతో, హారతులతో ఘన స్వాగతం పలికారు. ప్రజలను పేరుపేరునా ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దాదాపు 30 ఏళ్ల జేసీ సోదరుల రాజకీయ జీవితంలో తాడిపత్రి నియోజకవర్గ ప్రజలపై దౌర్జన్యాలు, దోపిడీలు తప్ప ప్రజలకు చేసిన మేలు ఒక్కటీ లేవన్నారు. మున్సిపల్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తాను చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేక అడ్డుకునేందుకు శత విధాలా ప్రయత్నిస్తున్నారన్నారు. జేసీ సోదరులకు అధికారం కావాలని, అందుకోసం తాము పూర్తిగా మారిపోయినట్లు నటిస్తున్నారన్నారు. మరోసారి వారిని నమ్మితే బతుకులు నరక ప్రాయం అవుతాయన్నారు. వచ్చే ఎన్నికల్లో మరో మారు జగనన్నను ఆశీర్వదిస్తే నియోజకర్గాన్ని తరతరాలు గుర్తుంచుకునేలా అభివృద్ధి చేస్తామన్నారు. సర్పంచులు వంగనూరు జేసీ అరుణ, కొండేపల్లి గోనుగుంట్ల వాణి, చల్లవారిపల్లి సత్యనారాయణ, బొందలదిన్నె, గంగాదేవిపల్లి పురుషోత్తం రెడ్డి, హనుమంతరెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సజ్జలదిన్నె రాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పల్లె నాగేశ్వర్‌రెడ్డి, జంబులపాడు, చల్లవారిపల్లి నాయకులు మోహన్‌నాయుడు, వలి, కళ్యాణ్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి హారతి ఇస్తున్న మహిళలు

వలంటీర్ల సేవలు ఎనలేనివి



సేవా రత్నా పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

● ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

పుట్లూరు: క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో వలంటీర్లు చేస్తున్న సేవలు ఎనలేనివని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అవినీతి అక్రమాలకు తావు లేకుండా ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో వలంటీర్ల పాత్ర ఎంతో కీలకమన్నారు. వలంటీర్ల సేవల ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు సులభంగా, వేగవంతంగా అందుతున్నాయన్నారు. వలంటీర్ వ్యవస్థను విమర్శించిన చంద్రబాబు తాను అధికారంలోకి వచ్చినా వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తానని చెప్పడం వలంటీర్ల పనితీరుకు నిదర్శనమన్నారు. 2019కు ముందు ఎన్నికల ప్రచారంలో 97 సంవత్సరాలు వృద్ధురాలికి పింఛన్ రాకపోవడాన్ని గుర్తించానన్నారు. కేవలం జన్మభూమి కమిటీలు సిఫార్సు చేస్తే మినహా పింఛన్లు, ఇతర పథకాలు అందే పరిస్థితి లేదన్నారు. పింఛన్ రాని వారిని కలెక్టరేట్‌కు రావాలని పిలుపునిస్తే పుట్లూరు మండలం నుంచే 100 మందికి పైగా వచ్చారంటే టీడీపీ ప్రభుత్వంలో వైఎస్సార్‌సీపీకి మద్దతు ఉన్న వారిని ఎంత ఇబ్బందులకు గురి చేశారో అర్థం చేసుకొవచ్చన్నారు. 2019లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే వలంటీర్ల ద్వారా వర్గాలు, పార్టీలకు అతీతంగా ప్రభుత్వ పథకాలను అందజేశారన్నారు. వృద్ధులను పింఛన్ ఎవరు ఇస్తున్నారని ప్రశ్నిస్తే వలంటీర్ అని చెబుతున్నారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. భవిష్యత్తులో వలంటీర్లు ప్రజలకు మరింత సేవలు అందించి జగనన్నను మరోమారు అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఓబుశేషు, లక్ష్మీదేవి, అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు ఆర్డీటీ కల్చరల్ పోటీలు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో ద్దరాంపురం రోడ్డు సమీపాన ఉన్న ఆర్డీటీ బధిరుల ఉన్నత పాఠశాలలో బుధవారం నుంచి రెండు రోజుల పాటు సృజన-2023 సెంట్రల్ లెవల్ కల్చరల్ పోటీలను నిర్వహిస్తున్నట్లు పాఠశాల హెచ్‌ఎం ఎర్రిస్వామి ఓ ప్రకటనలో తెలిపారు. పోటీల్లో విభిన్న ప్రతిభావంతులు డ్యాన్స్‌లు, పాటలు, నాటకాలు ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి ఆర్డీటీ డైరెక్టర్ విశాల ఫెర్రర్, డీఐటీ సెక్టార్ డైరెక్టర్ దశరథ, రీజనల్ డైరెక్టర్లు హాజరవుతారని తెలిపారు.

నేడు ‘గడప గడపకూ మన ప్రభుత్వం’

యల్లనూరు: మండల కేంద్రంలోని బీసీ కాలనీ నుంచి గడపగడపకూ మన ప్రభుత్వ కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ప్రారంభిస్తారని జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, జెడ్పీటీసీ ప్రతాప్ రెడ్డి తెలిపారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

పేదల జీవితాల్లో సంక్షేమ కాంతులు

పుట్లూరు: పేదల జీవితాల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ కాంతులను నింపుతోందని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. మంగళవారం బాలాపురం, పి.చింతలపల్లి గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను వివక్షకు తావు లేకుండా అందజేస్తున్నాం కాబట్టే ధైర్యంగా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సంక్షేమాన్ని వివరించడంతో పాటు ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడమే కార్యక్రమ లక్ష్యమన్నారు. పేదలకు ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాలను చంద్రబాబు శ్మశానాలతో పోల్చడం దారుణమన్నారు. పల్లెల్లో చాలా మంది సెంటు స్థలంలోనే ఇళ్లను నిర్మించుకుని జీవిస్తున్నారని, పట్టణ ప్రాంతాల్లో ప్రభుత్వం ఇచ్చిన సెంటు స్థలంలో ఇళ్లను నిర్మించుకున్నారని గుర్తు చేశారు. పేదల ఇళ్ల స్థలాలను శ్మశానాలతో పోల్చడం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చంద్రబాబు ప్రజలకు ఇంటి స్థలాలు ఇవ్వకపోగా జగనన్న ఇస్తున్న ఇంటి స్థలాలను చూసి కడుపుమంట వచ్చేస్తోందన్నారు. పేదలకు ఏమి చేసినా దుష్టచతుష్టయం నిస్సిగ్గుగా అడ్డుపడుతోందన్నారు. ప్రజల సంక్షేమం కోసం నిరంతరం ఆలోచించే జగనన్న ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజల గుండెల్లో నిలిచారన్నారు.



బాలాపురంలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

గ్రామ వార్డు సచివాలయాలు ప్రజలకు ఎంతో చేరువయ్యాయని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రజలు ధైర్యంగా తమ పనులను చేసుకోవడంతో పాటు, గ్రామంలోని అన్ని రకాల ప్రభుత్వ సేవలను పొందుతున్నారని తెలిపారు. పంటలకు ఉచిత బీమా సౌకర్యం కల్పించడంతో పాటు పండించిన పంటకు గిట్టుబాటు ధరలు, గ్రామాల్లోనే విత్తనాలు, ఎరువులు అందిస్తున్నారని తెలిపారు. అనంతరం ఆయా గ్రామాల్లో సంక్షేమ పథకాల ద్వారా అందించిన లబ్ధిని వివరిస్తూ బ్రోచర్‌ను అందజేశారు. ఎంపీపీ భూమిరెడ్డి రాఘవరెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మూలి వెంకటరామిరెడ్డి వైఎస్సార్‌సీపీ, మండల కన్వీనర్ నాగేశ్వరరావు, సర్పంచులు రామకృష్ణారెడ్డి, ఓబుశేషు, నాయకులు నాగేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మిద్దె కుళ్లాయప్ప, లక్ష్మీనారాయణరెడ్డి, రామకృష్ణ, నాగభూషణం, రమణా యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు



అప్పేచర్ల గ్రామస్తులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ శంకర్‌రెడ్డి

పెద్దవడుగూరు : ఫ్యాక్షన్ గ్రామాల్లో ఎవరైనా శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ శంకర్‌రెడ్డి, ఎస్‌ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల నుంచి వివిధ రకాల సమస్యలతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. అప్పేచర్ల, దిమ్మగుడి, చిన్నవడుగూరు, ఏ.తిమ్మాపురం, క్రిష్టిపాడు తదితర ఫ్యాక్షన్ గ్రామాల్లో ఎవరైనా గొడవలను సృష్టించినా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో గొడవలు వచ్చే పరిస్థితి ఉన్నప్పుడు పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. ఉద్దేశ్య పూర్వకంగా గొడవలకు పాల్పడితే సహించబోమన్నారు.

పుస్తక పఠనంతో మేధోశక్తి



మాట్లాడుతున్న లైబ్రేరియన్ చంద్రకళ

పెద్దపప్పూరు: పుస్తక పఠనంతో మేధోశక్తిని పెంపొందించుకోవచ్చని లైబ్రేరియన్ చంద్రకళ విద్యార్థులకు సూచించారు. మంగళవారం స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణలో భాగంగా ఆమె విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడే పుస్తకాల గురించి తెలియజేశారు. వచ్చే నెల వరకు వేసవిశిక్షణ ఉంటుందని తెలిపారు.

బాల్య వివాహాల నిర్మూలనే ధ్యేయం



మాట్లాడుతున్న ఏసీడీపీఓ డిల్లేశ్వరి

గుత్తి: బాల్య వివాహాల నిర్మూలనే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా అడిషనల్ సీడీపీఓ డిల్లేశ్వరి, మెడికల్ ఆఫీసర్ దివ్య, సీఎస్‌డీటీ కంబారిక బాల్య వివాహాలతో కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో చైల్డ్‌లైన్ 1098 సభ్యులు నాగలక్ష్మి, మెప్మా సిబ్బంది కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె: బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని ఎంపీడీఓ తేజోత్స్న పేర్కొన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బందితో ప్రభుత్వ పథకాలపై వర్క్‌షాపు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ తల్లిదండ్రులు బాలికలకు 18 ఏళ్లు నిండిన తర్వాతనే వివాహం చేయాలన్నారు. అనంతరం జగనన్నకు చెబుదాం, ఇంటి నిర్మాణ పనులపై చర్చించి పలు సూచనలు చేశారు. తహసీల్దార్ ఉషారాణి, హౌసింగ్ ఏఈ విజయ భాస్కర్‌రావు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలకు తగిన గౌరవం

యాడికి: గ్రామాల్లో వలంటీర్లు అంద్తిస్తున్న సేవలకు ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తగిన గౌరవం ఇచ్చి సత్కరించడం హర్షించదగ్గ విషయమని ఎంపీపీ బొంబాయి ఉమాదేవి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిషత్ సమావేశ భవనంలో సేవామిత్ర అవార్డులు పొందిన 77మంది వలంటీర్లను వారు సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, సర్పంచులు ఓంకారమ్మ, సంజీవరాయుడు, ఎంపీటీసీ వెంకటనాయుడు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ప్రశాంత్ కుమార్, విజయలక్ష్మి, రామిరెడ్డి, అరుణ్‌కుమార్ నాయకులు కృష్ణారెడ్డి, హనుమంతరెడ్డి, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : వలంటీర్ల సేవలు చిరస్మరణీయమని ఎంపీపీ శ్రీదేవి, సర్పంచ్ వరలక్ష్మీ, ఎంపీడీఓ కుళ్లాయిస్వామి పేర్కొన్నారు. మంగళవారం విరుపాపురం, పెద్దవడుగూరు సచివాలయాల్లో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలంటీర్లు ప్రజలకు అందిస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.



వలంటీర్లను సన్మానించిన దృశ్యం

ఇంటి గుమ్మం వద్దే ప్రభుత్వ సేవలు



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

తాడిపత్రి టౌన్ : గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థతో ఇంటి గుమ్మం వద్దే ప్రభుత్వ సేవలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ యువనేత కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 11వ వార్డు పోరాట కాలనీలో మంగళవారం సాయంత్రం ఆయన జన చైతన్య యాత్ర కార్యక్రమం చేపట్టారు. వార్డు నాయకులు వరదలయ్య, ప్రసాద్, బషీర్, రామకృష్ణ, కిట్టుతో కలసి హర్ష వర్ధన్‌రెడ్డి ఇంటింటికీ వెళ్లి అందరినీ ఆప్యాయంగా పలకరించి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సచివాలయ వార్డు సెక్రటరీలు, వలంటీర్లకు సూచించారు. అనంతరం హర్ష మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. కులమత, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందస్తోందన్నారు. నాయకులు గణేష్, బాబా, జావీద్, లక్ష్మీరంగయ్య, కేశవరెడ్డి, బాషా ఘోరా, రామచంద్ర, మనోజ్‌కాశీ తదితరులు పాల్గొన్నారు.

ఉద్రిక్తతకు దారి తీసిన సీపీఐ ధర్నా

గుంతకల్లుటౌన్: పట్టణంలో మౌలిక వసతులను కల్పించాలంటూ మంగళవారం సీపీఐ మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నా కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. కౌన్సిల్ సమావేశం నుంచి కమిషనర్ తమ వద్దకు వచ్చి వినతిపత్రాన్ని తీసుకోవడం లేదని సీపీఐ నాయకులు కౌన్సిల్ సమావేశాన్ని అడ్డుకునేందుకు యత్నించారు. దీంతో సీపీఐ నాయకులు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. పలువురు ఆందోళనకారులు ఆస్తిపన్నుల వసూలు కౌంటర్ కిటికీ అద్దాలను ధ్వంసం చేశారు. ఆందోళనకారులను పోలీసులు అరెస్ట్ చేసి టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డీఎస్పీ నరసింగప్ప మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని మున్సిపల్ కమిషనర్‌తో చర్చించారు. మున్సిపల్ కమిషనర్ ఫిర్యాదు మేరకు నాయకులు వీరభద్రస్వామి, వెంకటేశ్వరనాయక్, గోపినాథ్, గౌస్, ఈశ్వరయ్య, దేవేంద్ర, వంశీ, రాముపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ గణేష్ తెలిపారు. ఇదిలా ఉండగా సీపీఐ నాయకుల తీరును మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్.భవాని, వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, మాజీ చైర్మన్ జింకల రామాంజనేయులు ఖండించారు.



ఆస్తి పన్ను వసూలు కౌంటర్‌ను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ భవాని, వైస్ చైర్‌పర్సన్లు

ప్రజలకు పరిశుభ్రమైన నీరందించాలి

గుంతకల్లుటౌన్: పట్టణ ప్రజలకు శుద్ధమైన తాగునీటిని సరఫరా చేయాలని అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు కోరారు. మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్.భవాని అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. కౌన్సిలర్లు పవన్‌గౌడ్, కృపాకర్ మాట్లాడుతూ రంగుమారిన కలుషిత నీటిని సరఫరా చేస్తుండటం కారణంగా ఆ నీరు తాగాలంటే ప్రజలు ఆందోళనకు గురవుతున్నారని తెలియజేశారు. చైర్‌పర్సన్, కమిషనర్ బండి శేషన్న బదులిస్తూ వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులు, అత్యధిక ఉష్ణోగ్రతల కారణంగానే సమ్మర్‌స్టోరేజీ ట్యాంకుల్లోని నీరు రంగుమారిందని నిపుణుల ద్వారా తెలిసిందన్నారు. పరీక్షల నిమిత్తం నీటి శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపగా నీటిని తాగడం వలన ఎటువంటి హాని కలగదని నివేదిక పంపినట్లు వారు వెల్లడించారు. రూ.18.95 లక్షలతో పట్టణంలోని పలు వార్డుల్లో సీసీ డ్రైనేజీల్లో పేరుకుపోయిన పూడికను తొలగించేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అలాగే పలు వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీలు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టేందుకు కౌన్సిలర్లు ఆమోదం తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు నైరుతిరెడ్డి, మైమూన్, కౌన్సిలర్లు, కోఆప్షన్‌సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ భవాని

బాలుడికి కౌన్సెలింగ్

యల్లనూరు: మండలానికి చెందిన ఇద్దరు పదో తరగతి విద్యార్థులు ఇటీవల పెళ్లి చేసుకున్న విషయం తెలిసింది. మంగళవారం ఎస్ఐ రామకృష్ణ, తహసీల్దార్ రమాదేవి బాలుడుతోపాటు తండ్రికి ప్రత్యేక కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం తహసీల్దార్ సమక్షంలో ఎస్ఐ బాలుడు, అతడి తండ్రిని బైండోవర్ చేశారు.

27న మండల సర్వసభ్య సమావేశం

గార్లదిన్నె: ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 27న ఎంపీపీ వెంకటనారాయణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తేజోత్స్న మంగళవారం తెలిపారు. మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

నేడు వలంటీర్లకు పురస్కారాలు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని చెరువు కట్ట వద్ద ఉన్న షిర్డీసాయికల్యాణ మండపంలో బుధవారం ఉదయం 10 గంటలకు వలంటీర్లకు పురస్కారాలు అందజేయనున్నట్లు ఎంపీడీఓ విజయభాస్కర్ తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి హాజరవుతారన్నారు. వలంటీర్లు, ప్రజా ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు ప్రజా సంక్షేమ యాత్ర

తాడిపత్రి టౌన్ : ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి బుధవారం చల్లవారిపల్లి, తిప్పారెడ్డిపల్లి, కొట్టాలపల్లి, కొనగుంటపల్లి, దిగువపల్లి గ్రామాల్లో ప్రజా సంక్షేమ యాత్ర చేపట్టనున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు కోరాయి.

కూలీలతో డబ్బు వసూలు చేస్తే చర్యలు



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీపీ యోగేశ్వరి, ఎంపీడీఓ నిర్మలాకుమారి

శింగనమల: ఉపాధి హామీ పనులకు సంబంధించి కూలీలతో డబ్బు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ నిర్మలాకుమారి సిబ్బందిని హెచ్చరించారు. మంగళవారం శింగనమల, పెరవలిలో ఎంపీపీ యోగేశ్వరి, ఏపీఓ శ్రీనివాసులు ఎంపీడీఓతో కలిసి ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కూలీలతో సమస్యల గురించి తెలుసుకున్నారు. పనులు జరిగిన వెంటనే బిల్లులు పెట్టాలని సిబ్బందికి సూచించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

యాడికి: మండలంలోని తిమ్మాపురం గ్రామ శివారులో పేకాట స్థావరంపై పోలీసులు మంగళవారం సాయంత్రం దాడి చేశారు. ఈసందర్భంగా ముగ్గురిని అరెస్ట్ చేసి 5 ద్విచక్ర వాహనాలు, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఘటనలో మరో 10 మంది పారిపోయారన్నారు. ఏఎస్ఐ రామాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదమ్ముల ఘర్షణ

గుత్తి రూరల్: గొందిపల్లి గ్రామంలో ఆస్తి విషయంలో అన్నదమ్ముల మధ్య మంగళవారం ఘర్షణ చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన అన్నదమ్ములు అయిన శేఖర్, మోహన్ మధ్య కొన్ని నెలలుగా ఆస్తి విషయంలో తగాదా నడుస్తోంది. ఈ క్రమంలో ఉదయం ఇద్దరి మధ్య గొడవ జరిగి ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఘర్షణలో మోహన్ భార్య శారద, కుమారుడు జస్వంత్‌కు గాయాలు కాగా శేఖర్ ఇద్దరు కుమారులకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడ్డ ఇద్దరినీ గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నాటుసారా విక్రేత అరెస్టు

గుత్తి రూరల్: బసినేపల్లి తండాలో నాటుసారా విక్రయిస్తున్న ఓ వ్యక్తిని మంగళవారం సెబ్ పోలీసులు అరెస్టు చేశారు. సెబ్ పోలీసులు వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కమల్ అనే వ్యక్తి కొన్ని నెలలుగా గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్నట్లు సెబ్ పోలీసులకు సమాచారం అందింది. పక్కా సమాచారంతో మంగళవారం వేకువజామున సెబ్ ఎస్ఐ అలీఅహ్మద్ సిబ్బందితో కలిసి కమల్ ఇంట్లో సోదాలు నిర్వహించారు. రహస్యంగా దాచి ఉంచిన 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని అతడిని అరెస్టు చేశారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలి

అనంతపురం కల్చరల్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని వక్తలు సూచించారు. మంగళవారం రెవెన్యూకాలనీలోని వివేకానంద యోగా కేంద్రంలో మెడిటేషన్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్, రామచంద్ర మిషన్ సహకారంతో సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మెళవాయి రాజశేఖరరెడ్డి అధ్యక్షత వహించారు. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి, అడిషనల్ ఎస్పీ హనుమంతు, ఫారెస్టు అధికారి దామోదర్‌రెడ్డి, డీపీఆర్వో గురుస్వామిశెట్టి, అబ్బా టీవీ డాక్టర్ హరిప్రసాద్ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

శింగనమల: ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు నమోదు చేయకపోవడంతో మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. ఆ సమయంలో తీసిన సెల్ఫీ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడం చర్చానీయాంశమైంది. పోలీసులు తెలిపిన మేరకు.. శింగనమల మండలం తరిమెల గ్రామానికి చెందిన సులోచన, ఆమె కుమార్తె ప్రియదర్శినిని 2021, నవంబర్ 21న అదే గ్రామానికి చెందిన రాజేష్, హేమంత్‌కుమార్ అసభ్య పదజాలంతో దూషించారు. దీంతో ఘర్షణ చోటు చేసుకోవడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఈ కేసు హియరింగ్‌కు వచ్చింది. దీంతో రాజీ కావాలంటూ తల్లీకుమార్తెపై ఒత్తిడి పెంచారు. ఈ క్రమంలో సోమవారం మరోసారి వారిని దూషించడంతో వారు డయల్ 100కు కాల్ చేసి ఫిర్యాదు చేశారు. దీంతో ఇరువర్గాలను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి, విచారణ అనంతరం ఇరువర్గాలపై కేసులు నమోదు చేశారు. అయితే మహిళలపై కేసు నమోదు చేయలేదన్న అపోహతో మంగళవారం రాజేష్ విషపూరిత ద్రావకం తాగుతూ సెల్ఫీ వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేశాడు. విషయం తెలుసుకున్న వెంటనే రాజేష్‌ను కుటుంబసభ్యులు సర్వజనాస్పత్రిలో చేర్పించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి



మృతురాలు మహాలక్ష్మి

తాడిపత్రి: విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందిన ఘటన సజ్జలదిన్నె సమీపంలోని జగనన్న కాలనీలో జరిగింది. వివరాలు..పట్టణంలోని కృష్ణాపురం 6 వ రోడ్డులో నివాసం ఉంటున్న చెన్నా మహాలక్ష్మి(35), శేఖర్ దంపతులకు ప్రభుత్వం సజ్జలదిన్నె వద్ద జగనన్న లే అవుట్‌లో స్థలంతోపాటు ఇల్లూ మంజూరు చేసింది. మంగళవారం రాత్రి ఇంటిలో లైట్ వేసే సమయంలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. రూరల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నిందితుల అరెస్ట్

యాడికి: ఈ నెల 18న పుప్పాల గ్రామంలో వలంటీర్ హర్షవర్ధన్‌పై దాడికి పాల్పడిన కేసులో నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ గురుప్రసాదరెడ్డి తెలిపారు. విధి నిర్వహణలో ఉన్న హర్షవర్ధన్‌పై అదే గ్రామానికి చెందిన టీడీపీ నేతలు గంగిరెడ్డి, విజయ్, ప్రభాకర్ దాడి చేసిన విషయం తెలిసిందే. ఘటనలో తీవ్రంగా గాయపడిన హర్షవర్ధన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ అనంతరం గంగిరెడ్డి, విజయ్, ప్రభాకర్‌ను మంగళవారం అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.